# వెంటనే సమస్యలు పరిష్కరించాలి


హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ రంగ కార్మికులు

- కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ రంగ కార్మికుల ధర్నా

వరంగల్, సెప్టెంబర్ 18 : భవన నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు నాయిని రవి, ఉప్పలయ్య మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు నేరుగా పథకాలు అందించాలన్నారు. వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి కార్మిక సంఘాల నాయకులను అడ్వయిజరీ కమిటీలో నియమించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు ప్రమాదంలో మరణిస్తే రూ. 10 లక్షలు, సహజ మరణానికి రూ. 5 లక్షలు చెల్లించాలన్నారు. కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, గృహవసతి, కార్మిక అడ్డాలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ నాయకులు పుల్లా భాస్కర్, యాకయ్య, బీఆర్‌టీయూ నాయకులు ఇంజాల మల్లేశం, తేలు సారంగపాణి, శివకుమార్, భిక్షపతి, గంగరాజు, కాకతీయ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మంజుల, పంకెర్ల కుమారస్వామి, నరసింహులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నియంత్రణకువైద్య శిబిరాలు

వరంగల్, సెప్టెంబర్ 18 : సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో లలితాదేవి తెలిపారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలతో పాటు గ్రామాలు, కాలనీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. సోమ, మంగళ, గురు, శుక్రవారాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. వైద్య శిబిరాల షెడ్యూల్‌ను పీహెచ్‌సీల వైద్యాధికారులకు అందజేస్తామని చెప్పారు. ప్రత్యేక వైద్య శిబిరాల్లో వైద్య పరీక్షలతో పాటు వ్యాధుల రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు. దీంతో పాటు ఇంటింటా జర సర్వే చేస్తామని తెలిపారు.

## ‘కలెక్టరేట్‌లో విద్యుత్ పోలేదు’

వరంగల్, సెప్టెంబర్ 18 : హనుమకొండ కలెక్టరేట్‌లో 17వ తేదీన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశం జరుగుతున్న సమయంలో విద్యుత్ అంతరాయం జరుగలేదని ఎన్‌పీడీసీఎల్ డీఈ సాంబరెడ్డి బుధవారం తెలిపారు. ‘నమస్తే’ తెలంగాణలో ప్రచురితమైన ‘కలెక్టరేట్‌లో విద్యుత్ అంతరాయం’ అనే కథనంపై ఆయన స్పందించారు. జనరేటర్‌కు కరెంట్ మార్పిడీ చేసే క్రమంలో 10 సెకన్లు ట్రిప్ అయిందన్నారు. ఈ విషయాన్ని ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ వెంకటరమణ ఆ సమావేశంలో ప్రకటించారని, అంతే తప్ప ఎలాంటి విద్యుత్ అంతరాయం కలుగలేదన్నారు.

## బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలి

శాయంపేట, సెప్టెంబర్ 18 : మండల పరిధిలోని గ్రామాల్లో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్ షాపులపై అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి వంగర సాంబయ్య డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో బెల్టు షాపులు ఉన్నాయని, కిరాణా షాపుల్లో సైతం విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నారన్నారు. దీంతో మధ్యతరగతి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని, సంబంధిత అధికారులు మామూళ్లు తీసుకుని బెల్ట్ షాపుల నిర్వహణకు సహకరిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న బెల్టు షాపులన్నింటినీ మూసివేయాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి

## గురుకుల పాఠశాలల పనివేళలు మార్చాలి

కమలాపూర్/దామెర, సెప్టెంబర్ 18 : గురుకుల పాఠశాలల పనివేళలు మార్చాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. బుధవారం కమలాపూర్‌లోని గురుకుల పాఠశాలలు, కళాశాలలను సభ్యత్వ నమోదులో భాగంగా సందర్శించారు. భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చెప్పవద్దన్నారు. ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, పాఠశాలలో కేర్ టేకర్‌లను నియమించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గెస్ట్ టీచర్లకు 12నెలల వేతనం చెల్లించాలని, మహిళా ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీ మినహాయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్‌రాజు, పెండెం రాజు, ఎంజేపీ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లివిన్‌స్టన్, రాష్ట్ర కమిటీ సభ్యులు సతీశ్, అశోక్, మధు, సురేశ్, గణేశ్, మాధవి, స్రవంతి పాల్గొన్నారు. అలాగే దామెర మండలంలోని ఓగులాపురం ఎస్‌బీట్ కళాశాలలోని ఎంజేపీ గురుకుల పాఠశాల, కళాశాలను యూటీఎఫ్ ఎంజేపీ వింగ్ సందర్శించింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ ఎంజేపీ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లివిన్‌స్టన్ మాట్లాడుతూ.. పాఠశాలల పనివేళలను మార్చాలని, గురుకుల విద్యాలయాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## అందుబాటులోకి ఎన్‌పీడీసీఎల్ కొత్త యాప్

**ఎస్ఈ వెంకటరమణ**

వరంగల్, సెప్టెంబర్ 18 : వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సాంకేతిక పరంగా మరిన్న అంశాలను జోడించి సరికొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని హనుమకొండ సర్కిల్ ఎస్ఈ వెంకటరమణ తెలిపారు. 19 ఫీచర్లతో యాప్‌ను తయారు చేశామన్నారు. రిపోర్ట్ అన్ ఇన్సిడెంట్, కన్జ్యూమర్ గ్రీవెన్స్, ఫిర్యాదు స్టేటస్, రీ ఓపెన్ కంప్లెయింట్, సెల్ఫ్ రీడింగ్, బిల్లుల చెల్లింపులు, బిల్ హిస్టరీ, ఆన్‌లైన్ బిల్ పేమెంట్ హిస్టరీ ఇలా వినియోగదారుడికి సౌకర్యవంతమైన సేవలు అందించే అంశాలు ఈ సరి కొత్త ఎన్‌పీడీసీఎల్ యాప్‌లో ఉన్నాయని తెలిపారు. వినియోగదారులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మెరుగైన సేవలు పొందాలని సూచించారు. సంస్థ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని కోరారు.

## జర్నలిస్ట్ హౌసింగ్, వెల్ఫేర్ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా రమణ



హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 18 : ఐజేయూ అనుబంధ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే) జర్నలిస్ట్ హౌసింగ్, వెల్ఫేర్ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా వల్లాల వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ప్రకటించారు. శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన రమణ మూడు దశాబ్దాలకు పైగా జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నారు. జర్నలిస్టు సంఘంలో గతంలో ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులుగా, సంయుక్త కార్యదర్శిగా, కోశాధికారిగా, నాలుగుసార్లు ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం మన తెలంగాణ దినపత్రిక ప్రత్యేక ప్రతినిధిగా కొనసాగుతున్నారు. తనను రాష్ట్ర కన్వీనర్‌గా నియమించడంతో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ, ప్రధాన కార్యదర్శి రాంనారాయణ, ఇతర యూనియన్ పెద్దలకు రమణ కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల హౌసింగ్, సంక్షేమానికి పాటుపడతానని చెప్పారు. ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులైన రమణకు వివిధ సంఘాల బాధ్యులు, సీనియర్ జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు.


శ్రమదానం చేస్తున్న అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

హసన్‌పర్తి, సెప్టెంబర్ 18 : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మడిపల్లిలో బుధవారం విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలో శ్రమదానం చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి పాఠశాల, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, స్వచ్ఛభారత్ ప్రతినిధి సంపత్, గ్రామ సెక్రటరీ తిరుపతి పాల్గొన్నారు.

## కొత్తకొండలో బాల బ్రహ్మానంద సరస్వతి పూజలు


కొత్తకొండ ఆలయ ఆవరణలో మొక్కను నాటుతున్న బాల బ్రహ్మానంద సరస్వతి

భీమదేవరపల్లి, సెప్టెంబర్ 18 : కొత్తకొండ వీరభద్రస్వామి దేవస్థానంలో బుధవారం నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం భక్తులకు శివలీలా విలాసం అనే అంశంపై ప్రవచనాలను ఉపదేశించారు. ఆలయ ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో ఈవో కిషన్‌రావు, అర్చకులు రాంబాబు, రాజయ్య, శ్రీకాంత్, వీరభద్రయ్య, వినయ్, రమేశ్, సందీప్ పాల్గొన్నారు.




















